

హుజూరాబాద్‌టౌన్: ఎన్నికల సామగ్రితో గ్రామాలకు తరలిపోతున్న ఉద్యోగులు



హుజూరాబాద్‌టౌన్: ఎన్నికల సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న సిబ్బంది

# పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి



హుజూరాబాద్‌టౌన్: అసెంబ్లీ ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను పరిశీలించి, ఎన్నికల సిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

- హుజూరాబాద్ నియోజకవర్గంలో 305 పోలింగ్ కేంద్రాలు
- ఎన్నికల విధుల్లో 610మంది అధికారులు, సిబ్బంది
- ఎన్నికల సామగ్రితో గ్రామాలకు తరలిన ఉద్యోగులు
- డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను పరిశీలించిన జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి

హుజూరాబాద్ టౌన్, నవంబర్ 29: అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. హుజూరాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి బుధవారం పోలింగ్ సెక్టోరల్ అధికారులు, పోలింగ్ సిబ్బంది ఎన్నికల సామగ్రితో గ్రామాలకు వాహనాల్లో తరలి వెళ్లారు. నియోజకవర్గంలో 305 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, 305 మంది ప్రిసైడింగ్ అధికారులు, 305 అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులను ఎంపిక చేయగా, వీరికి సహాయంగా ఒక పోలీస్‌ను నియమించారు. నియోజకవర్గంలో ఎన్నికల విధులు నిర్వహించడానికి మొత్తం 1310 మంది సిబ్బందిని కేటాయించారు. 30 మంది సెక్టార్ ఆఫీసర్లు, 30 మంది రూట్ ఆఫీసర్లను ఏర్పాటు చేసి ఎన్నికలు సాఫీగా జరుగడానికి రిటర్నింగ్ అధికారి ఎస్ రాజు చర్యలు తీసుకున్నారు. నియోజకవర్గంలోని హుజూరాబాద్, జమ్మికుంట, కమలాపూర్, వీణవంక, ఇల్లందకుంట మండలాల్లో 82 సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించారు. వీటి కోసం సుమారు 100 బస్సులు, జీపులు, కార్లను ఏర్పాటు చేశారు. ఒక్కొక్క రూటుకు ఒక బస్సు చొప్పున ఏర్పాటు చేసి సిబ్బందిని పోలింగ్ కేంద్రాలకు తరలించారు.

*వీణవంకలో..*

వీణవంక, నవంబర్ 29: మండలంలో నేడు జరుగనున్న సార్వత్రిక అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఎంపీడీవో కె.శ్రీనివాస్ బుధవారం మండలంలోని కనపర్తిలో ఏర్పాటు చేసిన గ్రీన్ పోలింగ్ స్టేషన్, నర్సింగాపూర్‌లోని మహిళా పోలింగ్ కేంద్రం, వీణవంకలోని మోడల్ పోలింగ్ స్టేషన్‌లతో పాటు సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ, మండలంలో మొత్తం 41,672 ఓటర్లు ఉండగా, 55 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొత్తం 200 మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, మంచినీటి సౌకర్యం, వైద్యం, టాయిలెట్స్‌తో పాటు ఓటర్లకు సహాయక కేంద్రాలు, దివ్యాంగుల కోసం వీల్‌చైర్లు, ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మండలంలో పోలింగ్ ముగిసే వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద పటిష్టమైన పోలీస్ భద్రత ఏర్పాటు చేశామని ఎస్ఐ ఆసిఫ్ తెలిపారు. ఎవరైనా ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. శాంతియుత వాతావరణంలో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని అధికారులు కోరారు.




వీణవంకలో మోడల్ పోలింగ్ కేంద్రం వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస్

## సమన్వయంతో పనిచేయాలి: డీఈవో

హుజూరాబాద్ టౌన్, నవంబర్ 29: డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎన్నికల సిబ్బందికి పలు సూచనలు చేశారు. పీవోలు, ఏపీవోలతో సమన్వయం చేసుకుని పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద హెల్త్ డెస్క్ తప్పనిసరిగా ఉండాలని, ఇందులో ఏఎన్ఎం, ఆశ వర్కర్ ఉండేలా చూడాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయిస్తే వెంటనే రిజర్వులో ఉన్న వాటిని అందజేస్తామని చెప్పారు. పోలింగ్‌లో ఒక్కో అభ్యర్థికి ఒక్కో ఏజెంట్ ఉండాలని, ఇద్దరు రిజర్వు ఏజెంట్లను కూడా అనుమతించాలని తెలిపారు. ఏజెంట్లు తప్పనిసరిగా ఆ పోలింగ్ కేంద్రం పరిధిలో ఓటర్ అయి ఉండాలని తెలిపారు. పోలింగ్ ముగిశాక కంట్రోల్ యూనిట్ బటన్ క్లోజ్ చేసుకోవాలన్నారు. పోలింగ్ ముగిశాక ఈవీఎంలు పోలింగ్ సిబ్బందితో కలిసి కరీంనగర్ ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ సెంటర్‌కు చేరుకోవాలని, అక్కడ స్ట్రాంగ్ రూమ్‌లలో ఈవీఎంలను భద్రపరచాలని సూచించారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే వారిని, అలాగే ఓటు వేసేందుకు డబ్బులు అడిగే వారిపై కూడా కేసులు బుక్ చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో సుమారు 82 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామని, ఇక్కడ అదనంగా బందోబస్తు ఏర్పాటు చేసి గట్టి నిఘా పెట్టామని తెలిపారు. ప్రజలు శాంతియుత వాతావరణంలో స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా 650 మందితో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని చెప్పారు. సమావేశంలో హుజూరాబాద్ రిటర్నింగ్ అధికారి ఎస్ రాజు, నోడల్ అధికారులు విజయ్‌కుమార్, సమ్మయ్య, శ్రీనివాస్, ఏసీపీ ఎల్ జీవన్‌రెడ్డి, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

## కమలాపూర్‌లో 65 పోలింగ్ కేంద్రాలు

కమలాపూర్, నవంబర్ 29: అసెంబ్లీ సాధారణ ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం పోలింగ్ నిర్వహించేందుకు సిబ్బంది ఎలాంటి ఇబ్బందులు లేకుండా వసతులు కల్పించారు. మండలంలో 65పోలింగ్ కేంద్రాలు ఉండగా, అందులో 33 సమస్యాత్మకంగా పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. కాగా పోలింగ్ కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలు ఉండటంతో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కేంద్ర బలగాల భద్రత మధ్య సిబ్బంది ఈవీఎంలతో పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు.



పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న పోలింగ్ సిబ్బంది



హుజూరాబాద్‌టౌన్: ఎన్నికల సిబ్బందిని తరలించేందుకు ఏర్పాటు చేసిన స్కూల్ బస్సులు, కార్లు, జీపులు

# అతివలే నిర్ణేతలు

- హుజూరాబాద్ నియోజకవర్గంలో మహిళా ఓటర్లే కీలకం
- పురుషుల కన్నా 5,157 ఓట్లు అధికం

హుజూరాబాద్, నవంబర్ 29: నేడు జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో హుజూరాబాద్ నియోజకవర్గంలో మహిళా ఓటర్లే కీలకంగా మారనున్నారు. అభ్యర్థుల గెలుపోటములను అతివలే నిర్ణయించనున్నారు. ఎన్నికల అధికారులు రూపొందించిన నూతన ఓటరు జాబితా ప్రకారం నియోజకవర్గంలో మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారు. హుజూరాబాద్ నియోజకవర్గ పరిధిలో ఐదు మండలాలు ఉండగా, ప్రతి మండలంలోనూ వారిదే పైచేయిగా ఉంది. ఇందులో అత్యధికంగా హుజూరాబాద్ మండలంలో, అత్యల్పంగా ఇల్లందకుంట మండలంలో మహిళలు ఓటర్లుగా ఉన్నారు. నియోజకవర్గంలో 305 పోలింగ్ బూత్‌లు ఉండగా, మొత్తం 2,44,514 ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుష ఓటర్లు 1,19,676, మహిళా ఓటర్లు 1,24,833 ఉన్నారు. దీన్ని బట్టి చూస్తే 5,157మంది మహిళా ఓటర్లు అధికంగా ఉండగా, ఎన్నికల్లో వారి ప్రభావం ఎక్కువగా కనిపించనున్నది.

*మండలాల వారీగా ఓటర్లు..*

హుజూరాబాద్ మండలంలో మొత్తం ఓటర్లు 63,145 ఉండగా, ఇందులో పురుషులతో పోలిస్తే మహిళా ఓటర్లు 1,787 మంది అధికంగా ఉన్నారు. ఇక్కడ 79 పోలింగ్ బూత్‌లు ఉండగా, పురుష ఓటర్లు 30,679, మహిళా ఓటర్లు 32,466 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. కమలాపూర్ మండలంలో మొత్తం ఓటర్లు 52,655 ఉండగా, పురుషులతో పోలిస్తే 1,193మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. ఇక్కడ 65 పోలింగ్ బూత్‌లు ఉండగా, పురుష ఓటర్లు 25,731, మహిళా ఓటర్లు 26,924 మంది ఓటేయనున్నారు. జమ్మికుంట మండలంలో మొత్తం ఓటర్లు 61,064 ఉండగా, పురుషులతో పోలిస్తే 1,070మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. ఇక్కడ 77 పోలింగ్ బూత్‌లు ఉండగా, పురుష ఓటర్లు 29,997, మహిళా ఓటర్లు 31,067 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.వీణవంక మండలంలో మొత్తం ఓటర్లు 41,672ఉండగా , పురుషులతో పోలీస్తే 735మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. ఇక్కడ 55 పోలింగ్ బూత్‌లు ఉండగా, పురుష ఓటర్లు 20468, మహిళా ఓటర్లు 21203 మంది ఓటేయనున్నారు. ఇల్లందకుంట మండలంలో మొత్తం ఓటర్లు 25,975 ఉండగా, పురుషులతో పోలిస్తే కేవలం 372 మంది మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. ఇక్కడ 29 పోలింగ్ బూత్‌లు ఉండగా, పురుష ఓటర్లు 12,801, మహిళా ఓటర్లు 13,173 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఇతరులు హుజూరాబాద్ మండలంలో ముగ్గురు, వీణవంక, ఇల్లందకుంట మండలాల్లో ఒకరు చొప్పున ఉన్నారు. కాగా, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు వారిని ప్రసన్నం చేసుకోవడానికి పావులు కదుపుతున్నారు. ఓటరు జాబితా లెక్కల ప్రకారం ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల భవితవ్యం మహిళలపైనే ఎక్కువగా ఆధారపడి ఉందనడంలో సందేహం లేదు.

# సంక్షేమ సర్కారుకు అండగా నిలువాలి

**బీఆర్ఎస్ వై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుల రాజలింగారెడ్డి**



మాట్లాడుతున్న బీఆర్ఎస్‌వై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుల రాజలింగారెడ్డి పక్కన నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు భుసారపు బాపురావు, ఎండీ బాబా

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 29: అన్ని వర్గాల సంక్షేమానికి పాటుపడుతున్న బీఆర్ఎస్ సర్కారుకు ప్రజలు ఈ ఎన్నికల్లో అండగా నిలువాలని బీఆర్ఎస్‌వై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుల రాజలింగారెడ్డి కోరారు. బుధవారం మండలంలోని పెద్దపాపయ్యపల్లి, చిన్నపాపయ్యపల్లి గ్రామాల్లో ఇంటింటా ఇరువురితో కలిసి తిరిగి బీఆర్ఎస్‌కు మద్దతుగా ఓట్లు అభ్యర్థించారు. అనంతరం పట్టణంలోని పార్టీ ఆఫీస్‌లో ఆయన మాట్లాడుతూ, ప్రజల ఆశీర్వాదంతో బీఆర్ఎస్ రాష్ట్రంలో రెండు సార్లు గెలిచి, తెలంగాణ, హుజూరాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిందని గుర్తు చేశారు. హుజూరాబాద్ నియోజకవర్గంలో అనేక చెక్ డ్యాంలు ఏర్పాటు చేసుకొని వ్యవసాయం రంగంలో అభివృద్ధి సాధించామన్నారు. మారుమూల గ్రామాలకు సైతం బీటీ, సీసీరోడ్లు వేసిందని, అండర్ డ్రైనేజీలు నిర్మించిందని తెలిపారు. హుజూరాబాద్, జమ్మికుంట పట్టణాల్లో రూ.వందల కోట్లతో అనేక అభివృద్ధి పనులు చేపట్టిందని చెప్పారు. బీఆర్ఎస్ ప్రవేశపెట్టిన ఎన్నికల మ్యానిఫెస్టోకు తమ నాయకుడు కేసీఆర్ గ్యారెంటీ అని ధైర్యంగా చెబుతున్నామని.. మరి కాంగ్రెస్ 6 పథకాలకు గ్యారెంటీ ఎవరని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీల నాయకులు చెప్పే కల్లబొల్లి మాటలు నమ్మి మోసపోకుండా, కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని ప్రజలకు రాజలింగారెడ్డి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు భుసారపు బాపురావు, ఎండీ బాబా పాల్గొన్నారు.

## అక్రమ మద్యం పట్టివేత

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 29: పట్టణంలోని కుమ్మరివాడలో ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు నిర్వహించగా అక్రమ మద్యం లభించడంతో ఇద్దరిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు హుజూరాబాద్ ఎక్సైజ్ సీఐ జీ దుర్గాభవాని తెలిపారు. మోతే రవి, నారాయణ అనే వ్యక్తుల వద్ద రూ.6 వేల విలువైన మద్యం, బీర్లు లభించాయని, వాటిని సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు.